www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 16 జూన్ 2025

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

పేద విద్యార్థులకు పట్టం కట్టిన తల్లికి వందనం

-మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

పేద విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన ఆదారంగా నిలిచిన తల్లికి వందనం పథకం నిలిచిందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి పథకం విజ యాన్ని ప్రజలతో కలిసి జరుపుకున్నారు. పథకంతో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నిధులు జమ అవడం సంతోషకమని అన్నారు. తల్లి దండ్రులుతమ పిల్లలను ఉన్నతంగా చదివించుకొని వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని అన్నారు. తల్లిని గౌరవించడం అనేది ఒక కుటుంబానికి మాత్రమే కాదు సమా జానికి పునాది ఈ భావనతో తల్లికి వందనం పథకాన్ని సిఎం చంద్రబాబు ప్రారంభించారని అన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు, తల్లులు, విద్యార్థులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంబరాలు చేసుకుంటున్న మంత్రి , తల్లిదండ్రులు

వేధింపులపై వయోవృద్ధులు కోర్టును ఆశ్రయించవచ్చు

-ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుభాన్

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సుభాన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులు, పిల్లలు నుంచి వేధింపులు ఎదుర్కొంటున్న వయోవృద్ధులు పరిష్కారానికి కోర్టును ఆశ్రయించవచ్చునని మదనపల్లె ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని అమ్మచెరువు మిట్ట నందు గల వెలుగు సంస్థలో వయోవృద్ధుల వేధింపులపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్జి బి.సుభాన్, సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ, బిటి కాలేజ్ మాజి కరెస్పాండంట్ మునిరత్నమయ్య, డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ధనలక్ష్మి, మదనపల్లె కేజీఎన్ కూరగాయల మండీ దాదాపీర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వృద్ధులు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్యలనైనా న్యాయస్థానం ముందు తెలియజేయాలని, వాటి ప్రక్రియలను వివరించారు. సంస్థలో ఆశ్రయం పొందుచున్న కొందరి వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని తెలియజేశారు. సిడబ్ల్యూసి వారిచే వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఆశ్రయం పొందుతూ మానసిక రుగ్మతతో బాధపడుతున్న రేఖ అనే బాలిక సమస్యను తెలుసుకుని పరిష్కారాన్ని చూపారు. వృద్ధాప్యంలో అవసరమయ్యే తగు సలహాలు, సూచనలను అందించారు. అనంతరం జడ్జి సుభాన్‌ను వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి శాలువాతో సత్కరించి మొమెంటోను అందజేసి సన్మానించారు. కులమతాలకు అతీతంగా టిటిడి నిత్యాన్నదానానికి ఉచితంగా కూరగాయలను పంపిణీ చేస్తున్న కేజే మండీ దాదాపీర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ లీనా కుమారి, సోషల్ వర్కర్ గీత, వార్డెన్ స్వీటీ, వృద్ధులు, చిన్నారులు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే అతిసార నిర్మూలన

-డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఉషశ్రీ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా అతిసారను నియంత్రించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉషాశ్రీ అన్నారు. ఆదివారం ఆమె కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ వరకు స్టాఫ్ డయేరియా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అతిసార మరణాలు తగ్గించడమే జాతీయ ఆరోగ్య పాలసీ ప్రధాన లక్షణం అన్నారు. రోజుకు మూడు లేదా నాలుగు సార్లు పలుచగా నీళ్ల విరేచనాలు అయితే దానిని అతిసారా వ్యాధి అంటారని తెలిపారు. అతిసార వల్ల సంభవించే మరణాలను ఆర్ఎస్, జింక్ చికిత్సతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా నివారించవచ్చని తెలిపారు. అతిసారతో ఏ ఒక్క మరణం జరగకూడదని దేశంతో స్టాప్ డైరియా ప్రోగ్రాం ముఖ్య లక్ష్యం అన్నారు. అతిసార రావడానికి పట్టణ మురికి వాడలు, కరువు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలు తొందరగా వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచడం ఒఆర్ఎస్, జింక్ అందుబాటులో ఉంచుకోవడం చేయాలని తెలిపారు. డయేరియాపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆశ కార్యకర్తలు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు గుర్తించి ఒఆర్ఎస్, జింక్ మాత్రలు స్పందించి వాడే విధానం పై అవగాహన కల్పించాలని తెలిపారు. చేతుల శుభ్రత, మరుగుదొడ్ల వాడకం వల్ల లాభాలు తెలియజేయాలని కోరారు. డయేరియా కార్యక్రమంలో అన్ని శాఖల సిబ్బంది , ఆరోగ్య స్రీశిశు సంక్షేమ శాఖ విద్యాశాఖ పంచాయతీరాజ్ ఇతర శాఖలు ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. అతిసార వల్ల మృతి చెందే ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలకు పూర్తిగా నివారించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ ఉషశ్రీ

'మిట్స్'కు ట్రిపుల్ ఎ రేటింగ్

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లెకు సమీపంలోని అంగళ్లు వద్ద గల మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో టాప్ 20 కళాశాలగా ట్రిపుల్ ఎ రేటింగ్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఎన్‌పిటఇఎల్ వారు ఆన్‌లైన్‌లో జనవరి-ఏప్రిల్ 2025 సెషన్ లో నిర్వహించిన పరీక్షలలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మొత్తం 7108 సర్టిఫికెట్ కోర్సుకు హాజరు కాగా అందులో 5747 ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయిలో ఎన్‌పిటఇఎల్ సర్టిఫికెట్ ను పొందడమే కాక, 200 మందికి గోల్డ్ రేటింగ్, సిల్వర్ 1191, ఎలైట్ 2419 కి లభించిందని అన్నారు. కళాశాలకు ఎఎఎ రేటింగ్ తో పాటు టాప్ 20 లో మిట్స్ కళాశాల 13వ ర్యాంక్ గా గుర్తింపు ను అందించినట్లు ఆయన అన్నారు. కళాశాల కు ఎన్‌పిటఇఎల్ వారు అందించిన ఈ గుర్తింపుకు కృషి చేసిన విద్యారులు, అధ్యాపకులు చేసిన కృషికి కలశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల కృతజ్ఞతలు తెలిపారు.

పేద విద్యార్థినులకు అండగా ఉంటాం

- డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

25 సంవత్సరాల నుంచి రెడ్డి సేవా సమితి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థినులకు ఉపకార వేతనాలిచ్చి ఉన్నత చదువులు చదివిస్తుందని రెడ్డి సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి అన్నారు. ఆదివారం కడప రాజీవ్ మార్గ్‌లో ఉండే రెడ్డి సేవా సమితి ప్రాంగణంలో సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదట వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్, వైద్య విద్యలను అభ్యసించే విద్యార్థిని విద్యార్థులకు రూ.2 లక్షల ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 8,9,10 తరగతులలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అర్హులైన పేద విద్యార్థినులకు విద్యను అభ్యసించుటకు వీలుగా 12 మంది బాలికలకు సదుపాయం కల్పించాలన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాజీవ్ మార్గ్‌లో వేమన సర్కిల్‌గా నామకరణం చేసి అందు వేమన విగ్రహం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రెడ్డి సేవా సమితి రజతోత్సవాల సందర్భంగా వేలాది మంది రెడ్డి ప్రముఖుల వివరాలతో 'మేలుకొలుపు' ప్రత్యేక సంచికను రూపకల్పన చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల పిల్లలకు వేమన పద్యాల పోటీలు నిర్వహించి నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తున్నామని చెప్పారు. పండుగ రోజుల్లో మన సంస్కృతిని ప్రతిబింబించే విధంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్‌లో పట్టు సాధించాలనే ఉద్దేశంతో హాస్టల్‌లో ఉండే విద్యార్థినులకు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పడానికి అధునాతన పద్ధతులకు అనుగుణంగా డిజిటల్ టెక్నాలజీతో ప్రత్యేకమైన గదిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యవర్గ సభ్యులు దేవిరెడ్డి రామచంద్రారెడ్డి, పప్పిరెడ్డి రెడ్డి కుమారి,నర్రెడ్డి ఆనంద కుమార్ రెడ్డి, లింగమదిన్నె మధుసూదన్ రెడ్డి, గుర్రంపాటి వెంకటరెడ్డి, సూత్రం శివరామ సుబ్బారెడ్డి, బెల్లం రామకృష్ణారెడ్డి, కరపు రెడ్డి చంద్ర ఓబుల రెడ్డి, శ్రీయపు రెడ్డి శివ నారాయణ రెడ్డి, మోపూరి నాగేశ్వర రెడ్డి, ఎ.రమేష్ రెడ్డి, ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, ఆదినారాయణ రెడ్డి పలు సూచనలు, సలహాలనిస్తూ ప్రతి ఒక్కరూ రెడ్డి సేవా సమితి పురోభివృద్ధికి ఆర్థిక సహాయ సహకారాల్ని అందించాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో రెడ్డి సేవాసమితి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రవి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో విద్యార్థులు అందరికీ అందు బాటులో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఈనెల 2న జూనియర్ కళాశాలలో ప్రారంభయ్యాయి. జిల్లా వ్యాప్తంగా జూనియర్ కళాశాలలు, విద్యార్థులు వివరాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు వివరాలు ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

ముఖా ముఖి..

అన్నమయ్య జిల్లాలో జూనియర్ కళా శాలల వివరాలు తెలపండి ?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 154 ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలలున్నాయి .ఇందులో ప్రభుత్వ 24, ఎయిటెడ్ 1, ఏపీ ఆర్‌జెసి 2, మోడల్ స్కూల్ 17, కెజిబివి 22, ఒకేషనల్ 10, సోషల్ వెల్ఫేర్ 10, హై స్కూల్ 8, ఎపిఆర్‌జెసి 2, ప్రయివేట్ 59 జూనియర్ కళాశాలలున్నాయి.

జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎంతమంది ఉన్నారు?

జిల్లా వ్యాప్తంగా ద్వితీయ సంవత్సరంలో ఇంటర్మీడియట్ విద్యార్థులు మొత్తం 14,579 మంది ఉన్నారు. ఇందులో 13,534 జనరల్,1045 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. ప్రథమ సంవత్సరంలో ఇప్పటివరకు 6,500 అడ్మిషన్ జరిగాయి. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయి. జులై 30 వరకు అడ్మిషన్లు నిర్వహిస్తాం.

జూనియర్ కళాశాలలు ప్రారంభించండానికి వసతులు అన్ని పూర్తి చేశారా?

ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం రోజు పాఠశాలకు వచ్చే విద్యార్థుల కోసం అహ్లాదకరమైన వాతావరణంలో అడుగుపెట్టేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. కళాశాలలో పరిశుభ్రంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నాం. విద్యార్థులకు ఫర్నిచర్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేశాం.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు చేర్పించడానికి ఎలాంటి ప్రణాళికలు చేపడుతున్నారు?

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను చేర్పించేందుకు ఈనెల మొదటి వారంలో ప్రచారం చేపట్టాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందించే సౌకర్యాలు విద్యాబోధన మరుగుదొడ్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులకు వివరిస్తూ గత ఏడాది కంటే ఎక్కువ ఉందని చేరాలా చర్యలు తీసుకుంటున్నాం.

ఈ ఏడాదిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈ ఏడాదిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కళాశాల ప్రారంభంనుంచే స్టడీ అవర్స్‌ను పెడుతున్నాం. ఎప్పటికీ అప్పుడు విద్యార్థుల ప్రగతిని గుర్తించి వారిని పాస్ అయ్యేవిధంగా ప్రిపేర్ చేస్తాం.

తల్లికి వందనం వివరాల తెలపండి?

జిల్లా వ్యాప్తంగా 352 మంది విద్యార్థులకు రూ . 4,576,00 తల్లికి వందనం అమౌంట్ వచ్చింది.

అన్ని కళాశాలల్లో విద్యార్థులకు సరిపడ అధ్యాపకులున్నారా? సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలలోనూ ఎలాంటి అధ్యాపకుల కొరత లేదు. ఒకవేళ ఎక్కడైనా అధ్యాపకులు బదిలీలో వెళ్లి ఖాళీ అయివుంటే అక్కడ అతిథి అధ్యాపకులను వెంటనే తీసుకున్నాం..

విద్యార్థులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

విద్యార్థులు తప్పని సరిగా రోజు కళాశాలకు రావడం అలవాటు చేసుకోవాలి. తల్లి తండ్రులు బాధ్యత తీసుకొని కళాశాలకు పంపాలి. అలాగే ప్రతి నెలా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డ్స్ అందజేసాతం. అలాగే మధ్యన భోజన కూడా అందుబాటులో ఉంది. ఇప్పటికే అన్ని కళాశాలకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందజేశాం. బ్యాక్ లాగ్ ఉన్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుంది. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంది.

గిరిజనుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గిరిజనుల అభ్యున్నతి కోసం ఆంధ్ర ప్రదేశ్ ఏకలవ్య గిరిజన పరిరక్షణ సేవా సంఘం కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు ఆవుల మల్లికార్జున తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ ఏకలవ్య గిరిజన పరిరక్షణ సేవా సంఘం నూతన అన్నమయ్య జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులు ఎంతో వెనకబడి ఉన్నారని, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ చైతన్య పరిచేందుకు మా సంస్థ పనిచేస్తుందని అన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు గిరిజనులకు సకాలంలో అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా అన్ని రంగాల్లో వెనుకబడిన గిరిజనులను తమ సంస్థ ద్వారా చైతన్యపరిచి అన్ని రంగాల్లో రాణించేలా ప్రతి గ్రామంలోనూ పర్యటిస్తామని తెలిపారు. ప్రతి గిరిజనుడు తమ సంస్థలో పాలి భాగస్తులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎఐఎస్ టిఇఒ జిల్లా అధ్యక్షులు పోలూరి గోపాల్, నాగేశ్వరరావు, రామచంద్ర, సురేంద్రబాబు, వీర నాగయ్య, రమణయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల మల్లికార్జున ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పేడ బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు రాయచోటి రాజబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోలూరు రమేష్, ప్రధాన కార్యదర్శిగా కోనేటి రామాంజనేయులు, కోశాధికారి ముంగా వెంకటనారాయణ, జాయింట్ సెక్రటరీగా బేసి ఆంజనేయులు, యూత్ ప్రెసిడెంట్ గా మల్లి శ్రీహరి, లీగల్ అడ్వైజర్ మల్లెల శ్రీనివాసులు, మీడియా కన్వీనర్ సాయికిరణ్, మదనపల్లె మండల అధ్యక్షుడు వెంకటగిరి నారాయణ, కురబలకోట మండల అధ్యక్షుడు గానిగిరి వెంకటరమణ, రామసముద్రం మండల అధ్యక్షుడు జి.గుర్రప్ప లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని రాష్ట్ర అధ్యక్షులు, ఇతర సభ్యులు పుష్పగుచ్చం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

అభివాదం చేస్తున్న ఎపివైజిపిఎస్ఎస్ సభ్యులు

పీలేరు వాసులకు కళాజ్యోతి జాతీయ పురస్కారాలు

కళా జ్యోతి జాతీయ పురస్కారాలు అందుకున్న పీలేరు వాసులు

ప్రజాశక్తి-పీలేరు

ఉమ్మడి చిత్తూరు జిల్లా కవులు, కళాకారులకు కళా జ్యోతి జాతీయ పురస్కారాల ప్రధానోత్సవం విజయవంతంగా జరిగింది. చిత్తూరు కేంద్రంగా ఆదివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవి కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు తేజాలకు కళాభిషేకం కళాకారుల సమ్మేళనం కళాజ్యోతి జాతీయ పురస్కారాలు - 2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ హాస్యనటుడు, నటకిరీటి రాజేంద్రప్రసాద్, సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు సుబ్రహ్మణ్యంశర్మ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ప్రముఖ రచయిత, వక్త, విశ్లేషకులు డాక్టర్ నారాయణస్వామిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం జరిగిన పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ అధ్యక్షులు ఎంవి శ్రీధర్ రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు మద్రిపూడి దేవేంద్ర రావు కవులు, కళాకారులకు కళాజ్యోతి జాతీయ పురస్కారాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పీలేరుకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ బహుభాషా నాటక కళాకారుడు ఖాదర్‌బాషా షేక్, ప్రముఖ పద్య కవి జలకనూరి మురళీధర్రాజు, కవి, రచయిత సరస్వతి శ్రీరామరాజు, కళాకారుడు, ఉపాధ్యాయుడు బి. చంద్రశేఖర్, విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ వెంకట శేషయ్యలు కార్యక్రమం నిర్వాహకుల నుంచి జాతీయ పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో సుమారు 300 మందికి పైగా కవులు, వివిధ రంగాల కళాకారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి దిక్సూచి ప్రతిభ పురస్కారాలు

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే, సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల ఉన్నతికి దిక్సూచిలా ఉపయోగపడతాయని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించే క్రమంలో వారిలో నూతనోత్సాహాన్ని పెంపొందిస్తాయని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పాత రిమ్స్‌లోని బిసి భవన్‌లో తొగటవీర క్షత్రియ కులానికి చెందిన పదవ తరగతి విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే విద్యార్థులకు నగదు పురస్కారాలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులంలో ఉన్న వెనుకబాటుతనాన్ని, పేదరికాన్ని, అసమానతలను తొలగించే విధంగా ప్రతిభా పురస్కారాలను అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్న తర్వాత కులానికి, సమాజానికి ఉపయోగపడినప్పుడే జీవితానికి నిజమైన సార్థకత సిద్ధిస్తుందన్నారు. మనం చేసే ప్రతి ప్రయత్నం సక్సెస్ అవుతుందో లేదో కానీ సక్సెస్ కావాలన్న తపనతోనే విద్యను అభ్యసించి దేశం గర్వించే స్థాయికి చేరుకోవాలని ఆకాక్షించారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేయాలన్నారు. తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా సంఘం తరపున విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తూ వారిలో దాగివున్న నిగూఢమైన శక్తిని వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. తమ మంచి ప్రయత్నానికి సంఘం పెద్దలు అందిస్తున్న తోడ్పాటు ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఈ సంవత్సరం 71 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు మెడల్స్ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి కొత్త ఉత్సాహాన్ని నింపామన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, జిల్లా సంఘం నాయకులు బండారు సూర్యనారాయణ, కుండా భాస్కర్, నగర శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, కోశాధికారి టేకూరి సుదర్శన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా మురళీ కృష్ణయ్య, ఉపాధ్యక్షులు చౌడం సూరిబాబు, గౌరవ అధ్యక్షులు పల్లా బాల చౌడన్న, సుంకర రామచంద్రుడు, సంగినాదం ఆంజనేయులు, గోవిందు నాగ రాజు, సిఆర్ఐ సునీల్ జయంత్, బొమ్మిశెట్టి చంద్రశేఖర్, డాక్టర్ చౌడం వెంక టేష్, బొలిశెట్టి వెంకటస్వామి, దొండ్ల వెంకటరమణ, కాల్వ వాగేష్ పాల్గొన్నారు.

బిసి భవన్ వసతులకు నిధులు కేటాయించండి కడప నగరంలో బిసి భవనంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరైన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ను బిసి సంఘం నాయకులు కలిసి మౌలిక వసతులకు నిధులు కేటాయించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, గోవింద్ నాగరాజు, కళ్యా సుధాకర్, త్రివిక్రమ్, సిఆర్ఐ సునీల్, హరికుమార్ పాల్గొన్నారు.

పేదలకు ఆహార ప్యాకెట్లు అందిస్తున్న వైసిపి నాయకులు

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా వైసిపి మైనార్టీ అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్ తన అభిమానాన్ని చాటుకున్నారు. ఆదివారం పట్టణంలోని పేదలకు ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభిమాన ప్రజా నాయకుడు గడికోట శ్రీకాంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా పేదలకు ఆహారాన్ని అందించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. రాయచోటి నియోజకవర్గం లోని ప్రతి ఇంట్లో సోదరుడిగా నిలిచారని ఏ ఒక్కరికి ఆపద వచ్చిన నేనున్నానంటూ భరోసా కల్పించి అభిమానాన్ని చాటుకున్నాడని తెలిపారు.అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసి రాయచోటి నియోజకవర్గానికి ఎన్నో సేవలు అందించారని ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటూ జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ కౌన్సిలర్లు హరూన్‌బాషా, ఫయాజుర్ రెహ్మాన్, షబ్బీర్ అహ్మద్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాపురం: మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం పార్టీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేకు కట్ చేసి ఘనంగా వేడుకలు చేసుకుని శ్రీకాంత్ రెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో పార్టీ మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపిపి గడికోట ప్రభాకర్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, చిట్లూరు సర్పంచ్ భూమారపు మాజీ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి హరినాథ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వేడుకోలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వేంపల్లి అటవీ రేంజి కార్యాలయం వారు పందిళ్ళపల్లి బీట్ అటవీ ప్రాంతంలో గడచిన వేసవి కాలంలో మంటలు ఆర్పుట పని చేయించుకుని వేతనాలు ఇవ్వకుండా వేధింపులు గురి చేస్తున్నారని ఫైర్ వాచర్ చెంచర్లపల్లి శివయ్య పేర్కొన్నారు. పందిళ్ళపల్లి అటవీ బీట్‌లో జనవరి నుంచి ఏప్రిల్ నెల వరకు వేసవి లో పాయలోపల్లి, వరికుంటపల్లి, గొట్లమిట్ట, వెలిగొండ, టేకలకొండ, సురభి రెడ్డివారిపల్లి, పూలుకుంట అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వేసవికాలంలో మంటలు ఆర్పి అటవీని రక్షించామని అన్నారు. జనవరి నెలకు మాత్రమే వేతనం ఇచ్చారని మిగిలిన మూడు నెలలకు వేతనాలు ఇవ్వకుండా వేధింపులు గురి చేస్తున్నారని వాపోయారు. ఎన్నిసార్లు అధికారులను వేతనాలు ఇవ్వాల్సిందిగా కోరిన స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అటవీ క్షేత్ర అధికారి బాలసుబ్రమణ్యం వివరణ కోరగా.. ఫైర్ వాచర్ శివయ్యను కార్యాలయానికి పిలిపించుకున సంబంధిత అధికారులను విచారించి వేతనాల అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎబిసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి పేర్కొన్నారు. మనిషికి శ్వాసించడం ఎంత అవసరమో, రక్తం కూడా అంతే ముఖ్యమని శ్వాస ద్వారా పీల్చుకున్న ఆక్సిజన్‌ను గుండె, మెదడు, ఊపిరితిత్తులు,కిడ్నీతోపాటు అన్ని అవయవాలకు చేరవేసేది రక్తమేనని అన్నారు. పేదవారికి రక్తాన్ని దానం చేయడానికి ఎల్లప్పుడూ ముందు ఉంటానని అన్నారు. మదనపల్లి ముజీబ్ నగర్‌కు చెందిన బాబ్‌జాన్ కిడ్నీ సమస్యలతో బాధపడుతుండగా కిడ్నీ మార్పిడికి చికిత్స జరుగుతోంది. అతనికి రెండు యూనిట్ల రక్తం అవసరమని తెలుసుకున్న డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి రెండు యూనిట్ల రక్తం వారికి అదేవిధంగా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజసేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములై వారి అక్కరలో తగు సహాయం చేయాలని ఆకాంక్షించారు. ప్రమాదాల్లో గాయాల కారణంగా, రక్తహీనత ఏర్పడినప్పుడు,మహిళల్లో కాన్పు సమయాల్లో రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని,ఇలాంటప్పుడే రక్తదాతల అవసరం ఎక్కువగా ఉంటుందనారు. ఇలాంటి సమయాల్లో రక్త అవసరత ఉన్న వాళ్ల తనను సంప్రదిస్తే తప్పక ఏర్పాటు చేస్తానని వెల్లడించారు. ఒకరి రక్తదానం నుంచి మరో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చుని అన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని భావికాడపల్లి పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామంలో ఆదివారం లోకాలమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రూపానంద రెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి పాల్గొని నూకాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. జాతరకు విచ్చేసిన సాయి వికాస్ రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

కలకడలో నరసాలమ్మ..

కలకడ: నరసాలమ్మ దేవత జాతరను ఘనంగా నిర్వహించారు. మండలంలోని నడిమి చర్ల పంచాయతీ నడిమి చర్ల గ్రామదేవతైన నలసాలమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. నలసాలమ్మను రంగురంగుల పూలతో అలంకరించి ప్రత్యేకమైన పూజలు నిర్వహించినట్లు తెలిపారు.అనంతరం రాత్రి చాందిని బండ్లు కట్టి, చెక్కభజనలు, కోలాటాలు, తదితరాలతో ఊరేగింపు గావించినట్లు తెలిపారు, ఈ జాతర నందు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఎస్‌ఐ శంకర్ నాయక్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు.

నల్ల గంగమ్మ తిరుణాల

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని ఈస్ట్ పేటలో వెలసిన గ్రామ నల్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా తిరుణాల నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషే కాలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. మహిళలు అమ్మవారికి వీలు బోనాలు సమర్పించుకున్నారు.

వేరుశనగ విత్తన కాయలు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కుమ్మరపల్లి రైతు సేవ కేంద్రంలో ఆదివారం రైతులకు టిడిపి యువ నాయకుడు ప్రదీప్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 మంది గ్రామ రైతులకు200 బస్తాల వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు ప్రభుత్వంరైతులకు సకాలంలో విత్తన కాయలు ఎరువులు సబ్సిడీతో అందించి రైతుల సంక్షేమ ప్రభుత్వం అని నిరూపించుకుందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులకు అందించేందుకు సిఎం చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలోనే రైతులకు సంక్షేమ పాలన అందుతుందని అన్నారు. రైతులకు కావాల్సిన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం విఎఎ హరీష్ కుమార్ టిడిపి నాయకులు రామాంజనేయరెడ్డి రైతులు పాల్గొన్నారు

రైతులకు వేరుశనగ విత్తనకాయలను అందిస్తున్న టిడిపి నాయకులు

నాడు కళకళ.. నేడు వెలవెల

ప్రాబవం కోల్పోతున్న గురుకుల పాఠశాల

ఇటీవల ప్రారంభమైన స్కూల్ నూతన భవనం

- గతంలో సీటు దక్కాలంటే గగనమే
- నేడు అడ్మిషన్ల కోసం ప్రచార బాట
- పదేళ్లుగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌తోనే నెట్టుకొస్తున్న వైనం
- ఇంటర్, పదిలో తగ్గుతున్న ఉత్తీర్ణత
- కొరవడిన మౌలిక వసతుల కొరత
- ఆసక్తి చూపని విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-రామాపురం

ఎస్‌సి, ఎస్‌టి, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మార్గదర్శిగా గురుకుల పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండల కేంద్రం రామాపురం సమీపంలోని నల్లగుట్టపల్లి సమీపంలోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల గతంలో విద్యార్థులతో కలకల లాడుతుండేది. నేడు విద్యార్థులు లేక అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులు ప్రచారబాట పట్టారు. రామాపురం సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా మోత్కుపల్లి నర్సింహులు1988 ఫిబ్రవరి13న శంకుస్థాపన చేశారు. నాటి నుంచి విద్యార్థులు ఉన్నత చదువులు చదివి డాక్టర్లు , ఇంజినీర్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఇతర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగస్తులుగా, రాజకీయ పార్టీలలో ఉన్నత స్థానాల్లో రాణిస్తూ ఉన్నారు. నాడు గురుకులంలో సీటు సాధించాలంటే విద్యార్థులు చదువుల్లో రాణించాలి లేదా అధికార పార్టీ నియోజకవర్గపు స్థాయి నాయకుల సిఫారసు ఉంటే గాని సీటు దక్కేది కాదు. నేడు విద్యార్థుల కోసం గ్రామాలలో గురుకుల పాఠశాలలో చేర్పించండి అని ప్రచారం చేసుకుని పరిస్థితి ఏర్పడింది. రెగ్యులర్ ప్రిన్సిపల్ లేకపో వడం, సుమారు పది సంవత్సరాలుగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ తోనే నెట్టుకొస్తుండటంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. ఉపాధ్యాయులు స్థానికంగా లేకపో వడం, తాగునీటి సమస్య, మౌలిక వసతుల కొరత అధికంగా ఉందని, ఇంటర్, పది ఫలితాల్లో కూడా ఉత్తీర్ణతశాతం తగ్గిపోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. 1988లో నిర్మించిన రూములు శిధిలావస్థకు చేరుకోవడం, మండలానికి ఆదర్శ పాఠశాల మంజూరు కావడంతో నాటి వైభవం తగ్గిపోయిందని చెబుతున్నారు. పదేళ్ల కిందట ప్రారంభమైన తరగతి గదుల నిర్మాణం ఎట్టకేలకు పూర్తి చేసుకొని ఇటీవల తరగతులు ప్రారంభించారు. ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా యువజన క్రీడల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తన సొంత నిధులతో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు వేయించారు. ఇక్కడికి రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించి, మౌలిక వసతులు కల్పించి గత వైభవాన్ని తీసుక రావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాల ముఖ ద్వారం

శిథిలావస్థలో ఉన్న నీటి ట్యాంకర్

టిబి రోగులకు పౌష్టికాహారం అందజేత

టిబి రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని రెడ్డి సంక్షేమ సంఘం సౌజన్యంతో టిబి వ్యాధితో బాధపడుతున్న రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ ని ఆదివారం పులి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. స్థానిక ధరణి హోటల్ ప్రాంగణంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి సంఘ గౌరవ అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, సంఘ అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు సంఘ సభ్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పంపిణీ చేయబడిన ఒక్కో పౌష్టికాహార కిట్‌లో బెల్లం,శనగ గింజలు, కేజీ, గోధుమ పిండి, రాగి పిండి, నూనె కంది పప్పు, శనగలు రూ.500విలువ గల నిత్యావసర సరుకులను అందించారు. ఈ కిట్లను ప్రతి నెలా ఒకసారి, మొత్తం ఆరు నెలల పాటు అందించనున్నట్లు సంఘ అధ్యక్షులు తెలిపారు. టి.బి. ముక్త భారత్ అభియాన్ లో భాగంగా, 2027 నాటికి టిబి రహిత భారతదేశం సాధించేందుకు తమ సంఘం ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తుందని అన్నారు. మాజీ అధికార భాషా సంఘం అధ్యక్షులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ జబ్బు వచ్చిన తరువాత బాధపడకూడదని, వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మనం ఆరోగ్యంగా ఉండగలం అని సూచించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం స్వచ్ఛందంగా టిబి రోగులకు పౌష్టికాహార చేయూత అందించడమంటే పెద్ద సేవ అని కొనియాడారు. సమాజంలోని ప్రతి దాత ఇలాంటి బాధితులను దత్తత తీసుకోవాలి అని పిలుపునిచ్చారు. టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం టిబి వ్యాధికి అన్ని రకాల నిర్ధారణ పరీక్షలు, చికిత్స ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి అనవసరంగా ఖర్చు చేయకూడదని తెలిపారు. అనంతరం టిబిపై అవగాహన కల్పించే కరపత్రాలను రెడ్డి సంక్షేమ సంఘం వారు విడుదల చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ కృష్ణ కుమారి, నాగవేణి, ఆశా కార్యకర్తలు, టి.బి. రోగులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

దూదేకుల అభివృద్ధి, ఐక్యత కోసం పని చేద్దాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దూదేకుల అభివృద్ధి, ఐక్యత కోసం పాటుపడాలని నిర్వాహకులు గగ్గుటూరి హుమయున్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఓ ప్రయివేట్ కల్యాణ మండపంలో దూదేకుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూదేకుల కుల అభివృద్ధి, సంక్షేమం, ఐక్యత కోసం ప్రత్యేకంగా దూదేకుల వికాసం కార్యక్రమం దూదేకుల కేర్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో దూదేకుల కేర్ ఫోర్స్ అనే మొబైల్ యాప్‌ను పరిచయం చేశారు. దూదేకుల సామాజిక, ఆర్థిక, విద్య, ఆరోగ్య, ఉద్యోగ రంగాలలో ప్రగతికి తోడ్పడే ఉద్దేశంతో రూపొందించిన యాప్ ద్వారా దూదేకుల ప్రజలకు సమాచార సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన, విద్యా, ఉపాధి అవకాశాలు, హక్కులపై అవగాహన, సమాజంలో ఐక్యత పెంపొందించే కార్యక్రమాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ ద్వారా దుదేకుల సమాజం మరింత అభివృద్ధి పథంలోకి వెళ్లాలని, అందరికి ప్రయోజనం చేకూరాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. దూదేకుల సమాజం కోసం ఇదొక ముఖ్యమైన అడుగు అని హెల్ప్ లైన్ నెంబర్ 9989624611 విడుదల చేశారు. ఈ సమావేశంలో నిర్వాహకులు గగ్గుటూరి హుమాయూన్, సుంకేసుల చిన్న బాషా, చప్పలి కేశవ, వి.పీరయ్య విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి పలువురు ముఖ్య నాయకులు, దూదేకుల కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

తల్లికి వందనం పథకంతో లబ్ధిపొందిన కుటుంబం

ఉమ్మడి కుటుంబంలో 12 మందికి తల్లికి వందనం

ప్రజాశక్తి-కలకడ

మండలం కేంద్రమైన కలకడలో ఉమ్మడి కుటుంబానికి చెందిన 12 మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు అకౌంట్లో జమ అయినట్లు విద్యార్థుల తల్లులు పేర్కొన్నారు.గుర్రంకొండ రోడ్డులోని స్థానిక టవర్ వీధికి చెందిన నసీన్, ముంతాజ్ ,ఇరానీ, ఆసియా నలుగురు అన్నదమ్ములకు చెందిన భార్యలు వీరంతా ఒకే కుటుంబంగా ఉంటూ ఉమ్మడి కుటుంబానికి చెందినవారు. వీరి నలుగురికి 12 గురు సంతానం కాగా వారు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో విద్యను చదువు తుండడంతో తల్లికి వందనం పథకం ద్వారా 12 మందికి కలిసి రూ1.56 లక్షలు విద్యార్థుల తల్లుల అకౌంట్‌లో జమ అయినట్లు తెలిపారు.అకౌంట్ డబ్బులు పడడంతో తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

ఆధునిక తెలుగు కవిత్వానికి చిరునామా శ్రీశ్రీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెలుగు సాహిత్యాన్ని శాసించిన ఆధునిక మహాకవి శ్రీశ్రీ అని, ఆయన తెలుగు సాహిత్యానికి చిరునామాగా నిలిచారని ప్రముఖ సాహితీవేత్త జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శ్రీశ్రీ 42వ వర్ధంతి సభను జన విజ్ఞాన వేదిక, సాహిత్య కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జెవివి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ అంతవరకు ఉన్న సంప్రదాయ చందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించి శ్రీశ్రీ ఆధునిక అభ్యుదయ భావాలకు పునాది వేశారని, మహాప్రస్థానం రచన ద్వారా తెలుగు సాహిత్యానికి కొత్త ఒరవడిని సృష్టించారని పేర్కొన్నారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విరసం వరలక్ష్మి మాట్లాడుతూ సామాన్య జనం కోసం కవిత్వాన్ని జన భాషలో రాసిన శ్రీశ్రీ ప్రజాకవి అని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం శ్రీశ్రీ పరితపించానని అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం తెలుగు సాహిత్యం ఉన్నంతవరకు నిలిచి ఉంటుందన్నారు. సమావేశంలో పుత్తూరు వెంకట సుబ్రహ్మణ్యం, పి.వి.రామారావు, సహదేవుడు, సారథి, అక్షయ పాల్గొన్నారు.

కడప అర్బన్ : శ్రీరంగం శ్రీనివాసరావు సామాన్య జీవితాన్ని ప్రారంభించి తన తెలుగు సాహిత్య గేయ రచయితలతో అభిమానుల చేత శ్రీశ్రీగా బిరుదు అందుకున్న మహాకవి శ్రీశ్రీ అని తెలుగుదేశం పార్టీ నగర ఉపాధ్యక్షులు కొండ సుబ్బయ్య అన్నారు. ఆదివారం శ్రీశ్రీ 42వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ సినీ రంగాలలో కూడా ఎన్నో ఉత్తమమైన గీతాలను అందించారని తెలిపారు. అందులో దేవుడు చేసిన మనుషుల్లారా, యమగోల, అల్లూరి సీతారామరాజు చిత్రాల గీతాలతో తెలుగు రాష్ట్ర ప్రజల మన్ననలను పొందారని చెప్పారు. 1974 సంవత్సరంలో అల్లూరి సీతారామరాజు చిత్రంలో అందించిన 'తెలుగు వీర లేవరా..' అనే గీతాన్ని నేటికీ ఆలపిస్తు, వినిపిస్తూ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయల్ అబ్దుల్ కరిముల్లా, నాగయ్య పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటిలో యోగా శిక్షణ విజయవంతం

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా 5 రోజులపాటు నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఆదివారం యోగ శిక్షణ పూర్తిచేసిన 1,891 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన విద్యార్థులు తమ స్వగ్రామాలు, పూర్వ పాఠశాలలో యోగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఖర్చులేని ఆరోగ్యం యోగా ద్వారానే సాధ్యం అన్నారు. యోగా దినోత్సవాన్ని ఒక వేడుకగా కాకుండా ఆరోగ్యంపై అవగాహన కలిగించే సామాజిక ఉద్యమంగా మలచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఉన్నత విద్యాశాఖ ద్వారా యోగాంధ్ర పోర్టల్‌లో దాదాపు 4,743 మంది విద్యార్థులు నమోదైనట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల ద్వారా లక్షల మంది యోగా లాభాలను చేరవేసే దిశగా ఆర్జీయూకేటీ ముందడుగు వేసిందన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, డీన్ రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

దర్బార్‌కు సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పేదలకు వరం సిఎం సహాయనిధి

-మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

పేదలకు సిఎం సహాయనిధి వరం లాంటిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు దళితవాడ చెందిన దర్బార్ అనే వ్యక్తి గత ఏడాది రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందారు. ఖర్చులను సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు చేయించి మంత్రిని కోరగా ఆదివారం మంత్రిక్యాంప్ కార్యాలయంలో రూ.71 వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా బాధితుడు దర్బార్ మాట్లాడుతూ దళితపేదనైన తనకు మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టి ఖర్చులు నిమిత్తం సిఎం సహాయ నిధిని మంజూరు చేయించడం తన జీవితంలో మరువలేనని అనారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు గాలివీటి సురేంద్ర నాథ్‌రెడ్డి , దేవదర్శన్‌రెడ్డి, చిట్టూరు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న హనీఫ్

సామాజిక కార్యకర్త హనీఫ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కలికిరి

ముస్లిం మైనారిటీ జెఎసి నాయకుడు, సామాజిక కార్యకర్త హనీఫ్ సేవలు అభినందనీయమని ముస్లిం జెఎసి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన పుట్టినరోజు వేడుకలు కలికిరి ధరణి హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి సభ్యులు మట్లాడుతూ హనీఫ కరోనా సమయంలో ముస్లిం మైనార్టీ జెఎసి ఏర్పాటు చేసి ఎంతోమంది కరోనా బాధితులకు దహన సంస్కారాలు చేస్తూ, కరోనా బారిన పడిన వారి కుటుంబాలకు ఆర్థిక, భోజనం వసతులు కల్పించి ప్రజలతో పాటు రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఆయన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఘనంగా సన్మానించారని అన్నారు. జెఎసి సభ్యులు, పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ నేను చేసిన సేవలను గుర్తించి ఇంత మంది నన్ను అభిమానించడం నాకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. వీరి మద్దతుతో మరింత ప్రజా సేవ చేయడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలోనల్లారి తిమ్మారెడ్డి, ధరణి హోటల్ యజమాని సత్యరెడ్డి, అడ్వకేట్ రాంప్రసాద్ రెడ్డి, ముస్లిం జెఎసి సభ్యులు జావేద్, సుభహాన్, జాకీర్, బుల్లెట్ షఫీ, ఇర్ఫాన్, మధు రెడ్డి, సోము, బోగేష్ పాల్గొన్నారు.

మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని ఎగువరెడ్డిపల్లి శ్రీ కోదండ రామాలయానికి రూ.14వేలు విలువ చేసే మైక్ సెట్‌ను శ్రీ లక్ష్మీనరసింహస్వామి కోలాట బృందం గురువు, ఉపాధ్యాయులు సివి.రమణమూర్తి వితరణగా అందించారు. కోలాట బృందం గ్రూప్ లీడర్ కుప్పాల ధనుంజయ్ గురువు మరియు కోలాట బృందం దేవాలయానికి మైక్ సెట్ ఇవ్వడం గ్రామంలో అందరూ సంతోషించదగ్గ విష య మని అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైక్ సెట్‌ను అందిస్తున్న కోలాట బృందం సభ్యులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కలకడ

శ్రీనివాసులు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ హంద్రీనీవా కాలువ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగినట్లు స్థానిక ఎఎస్‌ఐ శంకర్ నాయక్ తెలిపారు. సంబేపల్లి మండలం శెట్టిపల్లి పంచాయతీ జంగంపల్లికి చెందిన శ్రీనివాసులు(49) అతని భార్య సుశీల కలసి తన ద్విచక్ర వాహనంలో కలికిరి మండలం మర్రికుంటపల్లి పంచాయతీ నడింపల్లిలో ఉన్న తన వియ్యంకుని ఇంటికి వెళుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై హంద్రీనీవా సమీపంలో ఉన్న ఐఒసి పెట్రోల్ బంక్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి తన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో శ్రీనివాసులకు తలకు బలమైన రక్త గాయం కావడంతో అక్కడికి అక్కడే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీనివాసులు భార్య సుశీల ద్విచక్ర వాహనం నుండి ఎగిరి కింద పడడంతో స్వల్ప గాయాలతో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శంకర్ నాయక్ తెలిపారు. మృతుని భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మరో వ్యక్తికి గాయాలు..

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... నిమ్మనపల్లి మండలం వెంగంవారిపల్లి పంచాయతీ మంద్యంవారిపల్లెకు చెందిన మంద్యం రమణారెడ్డి సొంత పనులు పై తన ద్విచక్ర వాహనంలో కందురుకు వెళ్లి తిరిగి వస్తుండగా, మదనపల్లి కొత్తఇండ్లు రంగారెడ్డి కాలనీకి చెందిన బండి చంద్రశేఖర్ మద్యంసేవించి తన సొంత ఆటోలో సున్నం రాళ్ళను అమ్ముకుంటూ ఆటోను అజాగ్రత్తగా నడుపుకుంటూ మదనపల్లి నుంచి కందూరు వైపు వెళుతూ బాలినాయనపల్లి వద్ద ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న రమణారెడ్డిని ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డి చెవులోనూ, ముక్కులోనూ తీవ్ర రక్తస్రావం జరగడంతో గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా క్షతగాత్రుడిని మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చర్యలు చేపట్టారు.